ప్రచురణ తేదీ : 05-20-2019 రచయిత పేజీని సమర్పించినవారు:_____

# ఉండేల మాలకొండారెడ్డి

# సత్యం శివం సుందరం

Acc: No: 23949

ప్రథమ కిరణం: మాలకొండ మాట, మంచిమాట

పద్యకావ్యం

3057

రచయిత

**డా. ఉండేల మాలకొండారెడ్డి**

హ్యూస్టన్, టెక్సాస్‌లో జూలై 5-6, 1996 తేదీలలో
అతి వైభవంగా జరుగుతున్న
నాల్గవ 'ఆటా' తెలుగు మహాసభల సందర్భంగా వెలువరిస్తున్న
ప్రత్యేక ప్రచురణ

ప్రచురణ కర్త

**వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా**

హ్యూస్టన్, టెక్సాస్

# ముందుమాట

లోకరీతిని వేదాంతరీతిని రంగరించి పద్యాలలో నింపిన వాడు యోగి వేమన. ఆయునది అత్యంత సరళమైన ప్రజాభాష, అందుకే ఆ పద్యాలు ప్రజల నాల్కలపై నాట్యమాడుతూ చిరంజీవులైనవి. ఆటవెలది మూడుపాదాలలో మూడు లోకాలను నటింపచేసిన ప్రతిభాశాలి వేమన. ఆయన శైలి అనితర సాధ్యం. ఆయన పద్యాలను సాహిత్యంగా, ఆయనొక కవిగా సమకాలీన పండిత లోకం గుర్తించలేదన్నది నిర్వివాదాంశం. చేవగల విత్తనం. మట్టిలో వేసి త్రొక్కినా, మింటికి జీవవృక్షమై లేచినట్లు, ఆయన అమృత వాగ్బీజాలు, సామాన్య ప్రజల హృదయ క్షేత్రాలలో మొలిచి, చిగురించి, పుష్పించి, సుగంధాలు వెదజల్లినవి. ఆగ్లేయుడైన బ్రౌను మహాశయుడు ఆ సుగంధాన్ని ఆఘ్రాణించి, ఆనందించి, రసజ్ఞులకు పంచి పెట్టినాడు.

పద్యం తెలుగు వారి సొత్తు. అందులో వేమన పద్య శైలి, చిన్మయ రసానందకేళి. ఆయన పద్యాలను కంఠస్థం చేయని, ఉదహరించని తెలుగువాడు లేడంటే అతిశయోక్తి కాదు. ఒక్కసారి వింటే లేదా చదివితే ధారణకు నిలిచే రసగుళికలు వేమన పద్యాలు. ఆయన రచించిన పద్యాలు పదివేలకు పైగా ఉండవచ్చని పరిశోధకుల అభిప్రాయం. అందులో ఇతరులు రచించినవి వేమన రచనలు గా చలామణి అయ్యేపద్యాలెన్నో ఉండవచ్చు ఆయన రచనా శైలి ఎంత బలమైనదంటే, ఎవరు వ్రాసిన పద్యమైనా అందులో కొట్టుకొనిపోవచ్చు. అందులో ఆటవెలదిఆయన ప్రేయసి. ఆమె హృదయం ఆయనకే అంకితం. ఆహృదయంలో కొంతైనా స్థానం సంపాదించుకోవాలని ప్రయత్నించే పద్యకవులెందరో ఉన్నారు.

నా భావాన్ని ఆటవెలది పాదాలలో అందంగా అదించి, సహృదయులకు అందించాలని నా ఆశ. మారుతున్న ఆధునిక మానవ మనః ప్రవృత్తుల్ని, మానవత్వపు విలువల్ని గూర్చి నేను వెలువరిస్తున్న విభిన్న భావాలు పాఠకులకు చేరగలిగితే నాయీ చిన్ని కృషి ఫలించినట్లే. అనుభవశీలురైన పాఠకులు నా మంచిమాటను విని ఆలోచిస్తారని ఆశిస్తున్నాను. ఈ కావ్యాన్ని ముద్రించి హ్యూస్టన్‌లో ఆవిష్కరించుటకు సహాయ సహకారాలందించిన శ్రీ వంగూరి చిట్టెన్ రాజుగారికి, అమెరికా తెలుగు అసోసియేషన్ వారికి పరిచయం వ్రాసిన సాహితీ మూర్తి, ప్రసిద్ధ శాస్త్రజ్ఞుడు డా॥ పెమ్మరాజు వేణుగోపాలరావు గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఇట్లు

జూలై 2, 1996 — డి. డా. ఉండేల మాలకొండా రెడ్డి

డిసెంబర్ , 1996

శేషేంద్ర శర్మ

జ్ఞాన్‌బాగ్
హైదరాబాదు
500 012.

# కవి మాట మనిషికి బాట

శ్రీ ఉండేల మాలకొండారెడ్డి ఆంధ్రదేశంలో కవిగా లబ్ధ ప్రతిష్ఠుడు. నెల్లూరు రాజవీధులు ఆయన కవిత్వంతో మారు మోగుతున్న నాడు, నేనింకా గొంతు సవరించుకుంటున్నాను. మాల కొండారెడ్డి సాత్త్వికుడు; అందే మాలకొండా రెడ్డిసముద్రం అన్నంత అర్థం ఉంది ఇందులో. మానవ స్వభావమే కావ్య స్వభావమని గుర్తించిన శారదాతనయుడు తన భావ ప్రకాశంలో ''పరస్య సుఖః దుఃఖాదేః అనుభావేన చేతసః తద్భావభావనం యేన భవేత్ తదను కూలతః తత్సత్త్వం'' అన్నాడు. సత్త్వ గుణం చేతనే వాల్మీకి ''క్రౌంచవధ'' చూచి దుఃఖం పొందాడు. అలాగే మాలకొండారెడ్డి సత్త్వగుణప్రధానుడు; కనుకనే ఆయన అన్యుల సుఖదుఃఖాల్లో విలీనత పొందులాడు. అందుచేతనే ఆయనమొదటి కవి అయ్యాడు, తర్వాత విద్యా ప్రదానము, నివాస ప్రదానము, ఔషధ ప్రదానము చేశే సంస్థల్ని నెలకొల్పి విస్తృతంగా దుఃఖార్తులకు సేవ చేశాడు.

సత్త్వ గుణమే కవిత్వానికి జన్మస్థానము. సత్త్వ గుణం, కామక్రోధ మోహ మద మాత్సర్యాలను తొంగదీసినప్పుడే, ఉదయిస్తుంది. అప్పుడే అతడు అన్యులతో తనని కలుపుకొని జీవిస్తాడు. అప్పుడు అతని నోటి నుంచి సత్యమే నిర్గలమవుతుంది. ఒక్కొక్కప్పుడు కేవలం సత్యం చెప్పడం చేతనే ఆ మాటకు చమత్కార ప్రభావం సిద్ధిస్తుంది. అసత్యాల గుంపుల్లో సత్యం ఆశ్చర్య జనకంగా ఉంటుంది. ఉదాహరణకి, ''సులభాః పురుషాః రాజన్ సతతం ప్రియవాదినః అప్రియ స్యతు పథ్యస్య వక్తా శ్రోతాచ దుర్లభః'' (మనకిష్టమైన మాటలు చెప్పే వాళ్ళు ఎప్పుడూ సులభంగా దొరుకుతారు. హితము కానీ, అప్రియము అయిన మాటలు చెప్పేవాడు కానీ, వినేవాడు కానీ దొరకడం దుర్లభం.) ప్రాచీనమైన ఈ భారతదేశంలో సంస్కృత వాఙ్మయం నిండా శ్రోతలను చకచ్చకితుల్ని చేసే, సత్యానికి శబ్ద రూపాలైన సూక్తులు సుభాషితాలు, కోకొల్లలుగా వెదజల్లబడి ఉన్నాయి. ఈ సుభాషితాలు మహాకవుల కావ్యాల్లో నుంచి తీసుకుని అన్య గ్రంథ కర్తలు తమ గ్రంథాల్లో పేరు చెప్పకుండా వాడుకోవడం కూడా సంస్కృత వాఙ్మయంలో ఒక అలవాటు.

అది అగౌరవంగా భావింపబడలేదు! వెనక ఉదహరించిన ''సులభాః పురుషాః రాజన్ ....'' అనే శ్లోకం మారీచుడు అరణ్యకాండంలో తన రాజయిన రావణాసురుడికి హిత బోధ చేస్తూ చెప్పిన మాట. కానీ ఆ శ్లోకాన్ని యథాతథంగా శ్రీ భోజరాజ చరిత్రంలో తద్గ్రంథ కర్త పేరు చెప్పకుండా వాడుకున్నాడు. అట్లాగే ''అలాంపుష్పవతీంస్పృష్ట్వ స్నాతో విమల వారిషు! పునఃస్పర్శన శంకీవ మందం చలతి మారుతం'' అనే ఒక అజ్ఞాత కవి సుప్రసిద్ధ శ్లోకాన్ని విక్రమార్క చరిత్రకారుడు వాడుకున్నాడు. ఇలాంటి ఉదాహరణలు అసంఖ్యాకంగా ఉన్నాయి. ఇది ఈ దేశంలో సుభాషితాల సంగతి.

అయితే సుభాషితం ఎప్పుడూ సాత్త్వికుడినోటినుంచేవస్తుంది. వేమన, యోగి కనకనే, వేమన పద్యాలనే ఒక సుభాషిత హిరణ్యమని మనదేశంలో ఉంది. యోగం చేతనే మానవుడు సాత్త్వికుడవుతాడు. ''మాలకొండ నోట మంచిమాట'' అనే ఈ పద్యముక్తావళి సుభాషితాల సంగీతమయమైన సెలయేరు గనక పూర్వులను స్మరించి ఆ సుభాషిత తరంగిణితో ఈ ''మంచిమాట'' అనే మాలకొండ సుభాషితావళిని చేర్చుతున్నాడు.

''మాలకొండ మంచిమాటలు'' మన దేశంలో నేడున్న సమాజాన్ని సమగ్రంగా ప్రతిబింబించి నరకంలోకి దొర్లిపోతున్న మానవుడికి తన మంచిమాటని అడ్డువేసి రక్షించడానికి పూనుకుంటుంది.

''మోసగించినాడు ముని పత్ని నింద్రుడు !
అతడె దేవతలకు అధిపుడయ్యె!
అధిపుడగుటకొరకు అర్హత ఇదియేమొ!
మాలకొండ నోట మంచిమాట!

ఇందులో ఎంత గొప్ప సమకాలీనత ఉందో స్వయం స్పష్టము. సాత్త్వికుడైనవాడి మాట, అంటే కవిమాట, మనిషిని ఆలోచింపజేసి వాడిలో మార్పు తెచ్చింది. కావ్యాలు తెచ్చిన, అంటే సద్భాషలు మనిషిలో కలిగించిన మార్పులే పూర్వయుగాల చరిత్రలో నాగరికత లనబడ్డాయి. మనిషిని మనిషే తినడానికి పరుగులుతీస్తున్న ఈ వర్తమాన కాలాన్ని ''మాలకొండ నోట మంచిమాట'' ప్రభావితం చేస్తుందని నా విశ్వాసం.